
ఎవరెస్టు ఎక్కేస్తా...



- అనుమతి పొందిన వీఎం బంజర వాసి
- ఇప్పటికే కిలిమంజారో, ఎల్‌బ్రోస్ అధిరోహించిన మోతీకుమార్
- రూ.44.40 లక్షల ఖర్చు.. సాయం కోసం ఎదురుచూపు

4

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 5 డిసెంబరు 2024



కాళ్ల కింద నేల కంపించిన వేళ



- ఉమ్మడి జిల్లాలో భూ ప్రకంపనలు
- ఉదయం వేళ భయాందోళనకు గురై పరుగులు తీసిన జనం
- ఊగిన మంచాలు... వంట గదుల్లో కిందపడిన వస్తువులు...
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎక్కడ చూసినా అదే చర్చ
- అటు గోదావరి, ఇటు కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉనికి చూపిన భూకంపం
- దశాబ్దాలుగా సాగుతున్న బొగ్గు మైనింగ్ కూడా కారణమే



జూలూరుపాడులో భూకంపం రావడంతో వీధుల్లోకి వచ్చిన మహిళలు

ఖమ్మం/కొత్తగూడెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉదయం 7.27గంటల సమయం.. జనం దైనందిన కార్యకలాపాల్లో తలమునకలయ్యారు. కానీ అంతలోనే ఒక్కసారిగా తాము నిల్చున్న చోటు కుదుపునకు గురైంది. ఏవో శబ్దాలు వినిపించాయి. ఇలా మూడు సెకండ్లపాటు జరిగింది. ఏం జరిగిందో అర్థం కాక జనం అయోమయం చెందారు. కొందరు భయభ్రాంతులకు గురయ్యారు. ముందు ఏవో పేలుళ్ల ప్రభావం అనుకున్నారు. కానీ ఆ తర్వాత తెలిసింది భూకంపం సంభవించిందని. నిమిషాల వ్యవధిలోనే వాట్సప్ గ్రూపుల్లో భూప్రకంపనల సమాచారం వైరల్ అయింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.

బుధవారం ఉదయం భూప్రకంపనల వల్ల పలుచోట్ల రకరకాల ప్రభావాలు కనిపించాయి. ఇళ్లల్లో వస్తువులు పడిపోగా, అక్కడక్కడ ఇళ్లకు నెర్రెలుబారాయి. జిల్లా కేంద్రం ఖమ్మంతోపాటు సత్తుపల్లి, మధిర, పాలేరు, అన్ని నియోజకర్గాల్లోనూ భూకంపం అలజడి కనిపించింది. ఉదయం ఎక్కడ చూసినా భూకంపం చర్చలే కనిపించాయి.

ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా బుధవారం ఉదయం 7.26 గంటల సమయంలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఇళ్లలో ఉన్న ప్రజలు భయాందోళనలకు గురై బయటకు పరుగులుపెట్టారు. ములుగు కేంద్రంగా వచ్చిన భూకంపం కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు తదితర ప్రాంతాలకు వ్యాపించింది. రిక్టర్ స్కేల్‌పై 5.3గా కంపన శక్తి నమోదైంది. జిల్లా పరిధి గోదావరి పరివాహక ప్రాంతం కావడం, సింగరేణి బొగ్గుగనులు కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో విస్తరించి ఉండటంతో భూకంప ప్రభావం కనిపించింది. ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క రకంగా కంపించి రిక్టర్ స్కేల్‌పై 4 నుంచి 5 కంపన శక్తి నమోదైంది.

భూకంప తీవ్రతకు పలు ప్రాంతాల్లో రోడ్లు పగుళ్లు వ్యాపించాయి. ఇళ్లలోని కిచెన్ గదుల్లో వంట గిన్నెలు, ఫ్రిజ్‌ల్లో ఉన్న సామగ్రి, ఇళ్ల ముందు ఉన్న రేకులు పెద్ద ఎత్తున శబ్దాలు చేశాయి. పట్టణ కేంద్రాలైన కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేటలో భూకంప దృశ్యాలు సీసీ టీవీల్లో రికార్డు అయ్యాయి. భూమి ఊగుతున్నట్లుగా సీసీ ఫుటేజ్‌లలో నమోదైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంచాలపై కూర్చున్న, పడుకున్న వారు మంచాలు ఊగిపోవడం, కదలడంతో ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయం చెందారు.

ములుగు కేంద్రంగా ...

గోదావరి లోయ ప్రాంతంలోని ములుగు కేంద్రంగా రిక్టర్‌స్కేల్‌పై 5.0 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ఖమ్మం జిల్లాలోనూ కనిపించింది. ఉదయం మూడు సెకన్లపాటు వచ్చిన (మిగతా 4వ పేజీలో)

వంట సామాన్లు కదిలాయి



వెలుగు స్వప్న, బుర్హాన్‌పురం

పొద్దుపొద్దున్నే నిద్ర లేవగానే ఒక్కసారిగా వంట సామగ్రి కదిలిన శబ్దాలు వినిపించాయి. ఎందుకు అవి కదులుతున్నాయో అర్థం కాలేదు. లేచి చూసే వరకు అంతలోనే భూమి నుంచి ఒక రకమైన శబ్దం వచ్చింది. వెంటనే భయమేసి చుట్టుపక్కల వారిని ఎందుకు ఇలా అవుతుందని అడిగాను. మాకు అర్థం కాలేదని వారు అన్నారు. ఆ తర్వాత అది భూకంపం అని తెలిసింది.

చాలా భయమేసింది...



శీలం సాయి, శ్రీనివాసనగర్, ఖమ్మం

ఉదయాన్నే నిద్ర లేచే సమయానికి భూమి కంపించినట్లు అనుభూతికి లోనయ్యాను. ఇంట్లోని వస్తువులు కదిలాయి. బీరువా నుంచి శబ్దం వచ్చింది. దీంతో చాలా భయపడ్డాను. వెంటనే ఇంట్లోని వాళ్లందితో సహా వీధిలోకి వచ్చాను. ఎలాంటి నిర్మాణాలు లేని ప్రదేశంలోకి ఇరుగు పొరుగు వారిని తీసుకెళ్లాను. కాసేపటికి అంతా సద్దుమణిగింది.

బీరువాలు కదలడంతో భయపడ్డాం..



తాళ్లూరి మంగమ్మ, ఖమ్మం

వైయస్ఆర్ కాలనీలో ఉదయం ఏడున్నర గంటలకు టిఫిన్ తయారు చేద్దామని ఇంట్లోకి వెళ్తె బీరువా కదలటంతో ఆందోళనకు గురయ్యాం. ఎదురింటి వాళ్లు తమ ఇంట్లో ప్లేట్లు కిందపడ్డాయి అని చెప్పారు. ఎందుకు జరిగిందో అర్థం గాక భయంవేసింది. తర్వాత భూకంపం వచ్చిందని తెలుసుకున్నా...



డేంజర్ జోన్‌లో భద్రాచలం

- గతంలోనే హెచ్చరించిన ఎన్‌జీఆర్ఐ
- 56 ఏళ్లలో 199 సార్లు ప్రకంపనలు
- తాజాగా సంభవించిన ప్రకంపనల తీవ్రత స్వల్పమే
- 1969 ఏప్రిల్ 13న 5.5గా నమోదు

భద్రాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంతంలోని భద్రాచలంతోపాటు పలు ప్రాంతాలు భూకంప జోన్‌లోనే ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే ఈ ప్రాంతమంతా డేంజర్ జోన్‌లోనే ఉంది. ఈ విషయాన్ని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనగేష్ దావులూరి గతంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. భద్రాచలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం భూమి స్వల్పంగా కంపించడంతో మరోసారి భూకంపాలు, వాటి తీవ్రతలు, పరిణామాలు తదితర అంశాలపై సర్వత్రా చర్చ నెలకొంది. గత 56ఏళ్లలో భద్రాచలం ప్రాంతంలో 199సార్లు భూకంపాలు వచ్చినట్టు అధికార (మిగతా 4వ పేజీలో)

ఆనాడు పర్ణశాల ఆలయంపై పాక్షిక ప్రభావం



1969 ఏప్రిల్ 13న గోదావరి పరీవాహక ప్రాంతంలోని పర్ణశాలలో వచ్చిన భూకంపంతో పర్ణశాల రామాలయంలో కొద్దిభాగం పాక్షికంగా దెబ్బతింది. దీంతో అప్పటి భద్రాద్రి దేవస్థానం చైర్మన్ అల్లూరి మూర్తిరాజు, ఈవో నాగిరెడ్డిలు 1972లో పాత ఆలయం స్థానంలో సుమారు రూ.6లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. అలాగే 2004 జూలై7న భద్రాచలంలో స్వల్ప భూకంపం వచ్చింది. రిక్టర్‌స్కేలుపై అది 3.3గా నమోదైంది. దీంతో దేవస్థానం కల్యాణకట్ట, సుబ్రమణ్యేశ్వర ఆలయాలకు బీటలు వారాయి. 2008 ఫిబ్రవరి 21న కిన్నెరసాని వద్ద సైతం స్వల్పభూకంపం వచ్చింది.



సిద్ధమైన సభా వేదిక

బుగ్గపాడు ముస్తాబు

- నేడు ప్రజాపాలన విజయోత్సవ సభ
- ఫుడ్‌పార్కు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- రైతులకు అవగాహన సదస్సు
- హాజరుకానున్న ఐదుగురు మంత్రులు

సత్తుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని ఫుడ్ పార్కు ఆవరణలో భారీస్థాయిలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన ప్రజాపాలన విజయోత్సవ సభ జరగనుంది. ఇక్కడి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. బుగ్గపాడులో జరిగే సభకు కనీసం పదివేల మందిని తరలించాలని కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లుచేసింది. ఇందులో భాగంగా (మిగతా 4వ పేజీలో)

బంగ్లాలో హిందువులకు రక్షణ కల్పించాలి

- హిందూ ధర్మ రక్షాసమితి నాయకుల వినతి
- నగరంలో సంఘీభావ ర్యాలీ

4



ఖమ్మంలో ర్యాలీగా వస్తున్న హిందూ ధర్మ రక్షా సమితి నేతలు

ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- జిల్లాలో 135 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

4



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

బియ్యం కడగడంపై వివాదం

గొల్లపూడి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడు, ఏజెన్సీ నిర్వాహకురాలి మధ్య వివాదం తలెత్తడంతో రెండురోజులుగా మధ్యాహ్నభోజనం వండి వడ్డించడం లేదు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద అలాగే ఫంక్షన్లలో మధ్యాహ్నభోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఘటన వైరా మండలంలోని గొల్లపూడి ప్రాథమిక పాఠశాలలో నెలకొంది. మంగళ, బుధవారాల్లో ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండలేదు. ప్రధానోపాధ్యాయుడు జాన్, మధ్యాహ్నభోజన ఏజెన్సీకి చెందిన సుబ్బలక్ష్మి మధ్య మంగళవారం బియ్యం కడిగే సమయంలో వివాదం చోటుచేసుకుంది. దాంతో మంగళవారం, అలాగే బుధవారం కూడా మధ్యాహ్నభోజనం వండలేదు. మొదటిరోజు ఇళ్ల వద్ద భోజనం చేసిన విద్యార్థులు.. రెండోరోజు గ్రామంలోని అయ్యప్ప మాల ధరించిన స్వాముల ఇరుముడి కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానానికి వెళ్లారు. ఈ విషయమై ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లును వివరణ కోరగా గురువారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తామని తెలిపారు.

'102 వాహనం' అమ్మకు అండగా...

'102 వాహనం' అమ్మలకు అండగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా గత కొన్నేళ్లుగా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యాన్ని పంచేలా ఈ వాహనాలు విశిష్ట సేవలను అందిస్తోంది. ఆపద వచ్చిందంటే పక్కింటి వాళ్లే పట్టించుకోని ఈ రోజుల్లోనూ సమాచారం అందుకున్న పది నిమిషాల్లో వాహనాల్లో ఊరూరా తిరుగుతూ చికిత్సల నిమిత్తం గర్భిణుల్ని పీహెచ్‌సీలకు, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రులకు తీసుకొస్తున్న '102 వాహనం' కృషి ఎనలేనిది.



102 వాహనంతో గర్భిణులను ఆస్పత్రికి తీసుకొస్తున్న దృశ్యం

- ఆపద సమయాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న '102' సర్వీసులు
- జిల్లాలో 11 వాహనాలు అందుబాటులో...
- మూడు నెలల్లో 8,898 మంది మహిళలకు సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 102 వాహనాలు 11వరకు ఉన్నాయి. ఏన్కూరు, నేలకొండపల్లి, వైరా, తిరుమలాయపాలెం, మంచుకొండ, సత్తుపల్లి, మధిర, కూసుమంచి, కామేపల్లి, కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతోపాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా ఈ 102వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా పీహెచ్‌సీల పరిధిలో గర్భిణీలు నమోదయ్యారంటే చాలు వారికి వైద్య సేవలను ఆరోగ్యశాఖ అందిస్తుంటుంది. ఆశా కార్యకర్తలు గర్భిణీలను గుర్తించి వారికి అన్ని పరీక్షలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కోసారి స్కానింగ్ లేదా థైరాయిడ్ వంటి పరీక్షలు చేయాలంటే జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తుంది. ఇలా తీసుకెళ్లిన వారిలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించేలా మొక్కవోని ధైర్యంతో సేవలందిస్తూ మన్ననలు పొందుతున్నారు. ప్రసవానంతరం బాలింతలు, పిల్లలు, (మిగతా 4వ పేజీలో)

మూడు నెలలుగా 11వాహనాల ద్వారా అందిన 102 సేవలు

నెల	తిరిగిన ట్రిప్పులు	లబ్ధిదారులు
ఆగస్టు	1069	3127
సెప్టెంబరు	1044	2947
అక్టోబరు	1056	2824
మొత్తం	3169	8898

నెలకు రెండుసార్లు పరీక్షలు



గుగులోతు అనూష, హిమాంనగర్, ఏన్కూరు మండలం

తొలిసారి గర్భం దాల్చాను. వైద్యపరీక్షలన్నీ ఆశాలే చూసుకుంటున్నారు. 102 వాహనం ద్వారా పీహెచ్‌సీకి, జిల్లా ఆస్పత్రికి రెండుసార్లు పరీక్షల కోసం తీసుకెళ్తున్నారు. ఎలాంటి భయం లేకుండా 102వాహనంలో వెళ్లి తిరిగి తీసుకొస్తున్నారు. కాన్పు ఎప్పుడొచ్చేదీ, బిడ్డ ఎదుగుదల ఆరోగ్యం తదితర అంశాలను అక్కడే పరీక్షించి మందులు ఇస్తున్నారు. రూపాయి ఖర్చుకాకుండా ప్రభుత్వం ఇలాంటి వాహనాలు అందుబాటులోకి తీసుకురావడం వరంలాంటిది.

రోజూ 12 గంటల పాటు విధులు



సంగిశెట్టి మోహన్, తిరుమలాయపాలెం

గత కొన్నేళ్లుగా 102 డ్రైవర్‌గా పనిచేస్తున్నా. రోజు 12 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నా. కొవిడ్ లాంటి క్లిష్ట సమయంలోనూ సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహించాం. నిత్యం గ్రామాల్లో ఆశా కార్యకర్తల పిలుపు మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి గర్భిణులను పీహెచ్‌సీలకు, జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షల తర్వాత తిరిగి వారి ఇళ్ల వద్ద సురక్షితంగా వదిలిపెడుతున్నాం. ప్రభుత్వం మా సేవలను కుటుంబాలను గుర్తించి అన్ని వసతులు కల్పించాలి.

రాజీ మార్గమే రాజమార్గం..



- 14న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

వన్యప్రాణులను వేటాడటం నేరం



- మొక్కలను విరివిగా నాటాలి
- డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

అన్నదాన ప్రభువే...



- 12 ఏళ్లుగా అయ్యప్ప మాలధారులకు భిక్ష
- మధిర అయ్యప్ప దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహణ

ఉక్కపోత... ఆపై కరెంట్‌కోత

- రోజుకు ఐదుసార్లకు పైగా అప్రకటిత విద్యుత్ కోతలు
- పైస్థాయి అధికారులకు సమాచారం లేకుండానే ఎల్‌సీలు
- విద్యుత్ పంపిణీ తీరుపై ప్రజల ఆగ్రహం

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి సొంత జిల్లాలోనే అప్రకటిత విద్యుత్ కోతలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలలుగా అప్రకటితంగా విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వారం రోజులుగా ఉక్కపోత సతమతం చేస్తుండగా, ఇదే సమయంలో విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు ప్రజలకు ఆగ్రహం తెప్పించేలా ఉంది. పక్షం రోజుల క్రితం జిల్లాకు వచ్చిన టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎల్‌సీ తీసుకుంటే డివిజనల్ ఇంజనీర్ స్థాయి వరకు సమాచారం అందేలా ఏర్పాటు చేశామని ప్రకటించారు. కానీ అది అమలులో కానరావడం లేదు. ఇటీవల జరిగిన విద్యుత్ శాఖ బదిలీల్లో (మిగతా 4వ పేజీలో)



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మోతీకుమార్ (ఫైల్)

పుట్టింది నిరుపేద కుటుంబంలో.. అయినా ఆయన లక్ష్యం శిఖరం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కేందుకు సిద్ధమయ్యాడు ఆ గిరిజన కుర్రాడు. పట్టుదలతో సాధన చేసి ఎవరెస్టు ఎక్కేందుకు అనుమతి పొందాడు. కానీ ఆర్థిక ఇబ్బందులతో ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు.


పతకాలతో ..

ఎవరెస్టు ఎక్కేస్తా...

- అనుమతి పొందిన వీఎం బంజర యువకుడు
- ఇప్పటికే కిలిమంజారో, ఎల్‌బ్రోస్ అధిరోహించిన మోతీకుమార్
- రూ.44.40 లక్షల ఖర్చు...
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపులు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర గ్రామానికి చెందిన బర్మావత్ మోతీకుమార్ ప్రపంచంలోని ఎత్తైన ఏడు పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే ఇప్పటికే మైనస్ 40డిగ్రీల వాతావరణం ఉండే దక్షిణాఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో (సముద్ర మట్టానికి 5895మీటర్లు ఎత్తు), రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రోజ్ (సముద్ర మట్టానికి 5642 మీటర్లు ఎత్తు) పర్వతాలను ఎక్కి సత్తా చాటాడు. ఈ క్రమంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ పర్వతాన్ని (8848.86 మీటర్లు) ఎక్కేందుకు అనుమతి పొందాడు. అతడు అనుకున్నది సాధిస్తే తెలంగాణ నుంచి ఎవరెస్టు ఎక్కిన ఆరో వ్యక్తిగా మోతీకుమార్ నిలుస్తాడు. ఖమ్మంజిల్లాకు చెందిన తొలి యువకుడిగా రికార్డు నమోదు చేస్తాడు.

మోతీకుమార్ నేపథ్యం..

వీఎం బంజర గ్రామానికి చెందిన వీధి వ్యాపారులు బర్మావత్ రాంజా, అలివేలు దంపతుల కుమారుడు మోతీకుమార్. నిరుపేద కుటుంబంలో పుట్టిన అతడికి చిన్నప్పటి నుంచే ఆటలపై మక్కువ ఎక్కువ. పలు క్రీడల్లో ఎన్నో బహుమతులు గెలుచుకున్నాడు. చిన్నతనంలో తన తాత వెంట పశువులు కాయడానికి వెళ్లి పెద్ద పెద్ద రాళ్లు, గుట్టలు ఎక్కేవాడు. ఒకరోజు పుస్తకంలో పర్వతారోహణ గురించి చదివి గతంలో పర్వతారోహణ చేసిన వారిని చూసి ప్రేరణ పొందాడు. తానూ పర్వతారోహణ చేయాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే భువనగిరిలో రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో సంప్రదించాడు. అక్కడ 15రోజులు శిక్షణ తీసుకున్న తరువాత మోతీకుమార్ నైపుణ్యం బాగుండటంతో 2022 ఏప్రిల్ 5న దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించేందుకు అనుమతి సాధించాడు. అనంతరం ఆర్మీ అధికారుల పర్యవేక్షణలోని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉన్న బిరాంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనరీ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ శిక్షణ కేంద్రంలో నెలరోజుల కఠిన శిక్షణ తీసుకొని రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రోజ్ పర్వతాన్ని 2023 నవంబరు 11న అధిరోహించాడు. కిలిమంజారో, ఎల్‌బ్రోజ్ పర్వతాల అధిరోహించేందుకు 10 రోజులు చొప్పున మొత్తం 20 రోజుల సమయం పట్టింది. ఈ రెండు పర్వతాలు అధిరోహణలో ప్రతిభ కనబరిచిన అనంతరం 52రోజుల సమయం పట్టే ఎవరెస్ట్ పర్వతం ఎక్కేందుకు 2025 ఏప్రిల్ 1న రావాలని పిలుపు వచ్చింది.

రూ.44.40 లక్షల ఖర్చు

ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించేందుకు సుమారు రూ.44.40 లక్షలు ఖర్చు అవుతాయి. వీటిలో పర్వతారోణ చేసేటప్పుడు వినియోగించే డ్రెస్‌కు రూ.7లక్షలు, క్లైంబింగ్ చేసేటప్పుడు తీసుకునే ప్రత్యేకమైన ఆహారానికి రూ.15.12లక్షలు, ఆక్సీజన్ సిలిండర్లు రూ.3.86లక్షలు, ఇన్సూరెన్స్‌కు రూ.1.35లక్షలు, వీటితోపాటు రోప్, పర్సనల్ క్లాతింగ్‌కు రూ.4.25లక్షలు, గైడ్‌కు రూ.97,800, వీటికి అదనంగా జీఎస్టీ రూ.2.12లక్షలతో కలిపి మొత్తం రూ.44.40 లక్షలు ఖర్చు అవుతుంది.

ఆర్థిక సాయం కోసం...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వతం ఎక్కేందుకు భారీగా ఖర్చులు అవుతుండటంతో పేద కుటుంబానికి చెందిన మోతీకుమార్‌కు ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. ఎవరెస్ట్ శిఖరం ఎక్కి దేశం, రాష్ట్ర ఖ్యాతిని నిలుపడానికి తనకు ఆర్థిక స్తోమత లేదని వాపోతున్నాడు. దాతలు సహకరిస్తే ఎవరెస్టు శిఖరంపై దేశ కీర్తి పతాకాన్ని నిలబెడతానని హామీ ఇస్తున్నాడు. భారీ మొత్తంలో ఉన్న ఖర్చులకు డబ్బు సర్దుబాటు కాకపోతే తన లక్ష్యం నెరవేరదని, తన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వంతోపాటు ఇతరుల నుంచి ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు.


పూరి గుడిసె ముందు మోతీకుమార్


పండ్లు అమ్ముతున్న మోతీకుమార్ తల్లి

మేమూ లోడెత్తగలం

- కొర్లగూడెంలో హమాలీలుగా డ్వాక్రా మహిళలు
- గత పదేళ్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనులు
- ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలంటున్న మహిళలు

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం డ్వాక్రా మహిళలు హమాలీ కూలీలుగా మారారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరుగాలం శ్రమిస్తూ పురుషులతో దీటుగా పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామంలోని పలు డ్వాక్రా మహిళ సంఘాల సభ్యులు 20మందికిపైగా గ్రామంలోని మగ హమాలీలతోపాటు వానాకాలం, యాసంగి ధాన్యం తూకం పనులు చేస్తున్నారు.

కొర్లగూడెంలోని స్నేహ, సాయి దుర్గలకు చెందిన డ్వాక్రా గ్రూపుల నుంచి 20 మంది నిరుపేద వర్గాలకు చెందిన మహిళలు హమాలీ కూలీలుగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మగవారితో సమానంగా ధాన్యం కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు మోయటం, వాటిని లారీల్లో ఎత్తి లోడింగ్ చేయటం, ఆరబెట్టిన ధాన్యంను రాశులుగా చేయటం వంటి పనులు చేస్తున్నామని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. సగటున రోజుకు రూ.500 వరకు కూలి నగదు పొందుతున్నట్లు తెలిపారు.


కొనుగోలు కేంద్రంలో లారీలో ఎగుమతికి ధాన్యం బస్తాలు మోస్తున్న డ్వాక్రా మహిళలు


లారీలో ధాన్యం బస్తాలు ఎత్తి లోడింగ్ చేస్తున్న డ్రాక్రా మహిళలు

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తమ శ్రమకు ఆసరాగా మారాయని వారు వివరిస్తున్నారు. హమాలి కూలీలుగా పని చేస్తున్న వారిలో స్నేహ, సాయిదుర్గ డ్వాక్రా గ్రూపుల నుంచి గుంజి కోటేశ్వరి, తాళ్లూరి మంగా, చంద్రుపట్ల శ్రీలత, చింతా మానస, పాముర్తి లక్ష్మీ, కట్టా రాజేశ్వరి తదితర మహిళలు ఉన్నారు. ఇప్పటివరకు రైతుల నుంచి 12వేల బస్తాల ధాన్యం లారీల్లో లోడ్ చేసినట్లు తెలిపారు. ఇంకా 10వేల బస్తాలు తూకం వేయాల్సి ఉందన్నారు. కాటాల తరువాత ఆ బస్తాలను కూడా ఎగుమతి చేయాల్సి ఉందన్నారు. ప్రతి ఏడాది వ్యవసాయ సీజన్లలో సుమారు మూడు నెలల పాటుగా కొర్లగూడెం నుంచి డ్వాక్రా మహిళలు మగవారితో కలిసి (ముఠాగా) హమాలి కూలీలుగా శ్రమిస్తున్నారు.

రూ.2.53కోట్లతో నిర్మించిన
టీజీఎఫ్‌డీసీ కార్యాలయం ప్రారంభం

- వర్చువల్‌గా హైదరాబాద్‌లో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సత్తుపల్లిలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో రూ.2.53కోట్లతో నిర్మించిన తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన డివిజన్ కార్యాలయం, డీఎం, పీఎం క్వార్టర్లను హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రంసింగ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం 24.05నుంచి 33 శాతానికి పెంచేందుకు కొత్త ఆవిష్కరణలు, పరిష్కార మార్గాలు సంస్థ చేపడుతుందన్నారు. ఒకవైపు అడవులను సంరక్షిస్తూనే అటవీ సంపదను కూడా పెంచేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ప్రజల మద్దతుతోపాటు ఉద్యోగుల సహకారం ఉండాలన్నారు. వేగవంతమైన పట్టణీకరణ,పారిశ్రామికీకరణ, ప్రాజెక్టుల నిర్మాణం, అటవీ భూముల ఆక్రమణ, ఇళ్ల నిర్మాణాల కారణంగా అడవుల విస్తీర్ణం తగ్గుముఖం పట్టిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, ఎఫ్‌డీసీ డీఎం జీ.గణేష్, పీఎంలు వీ.బ్రహ్మాచారి, ఎస్.నాగరాజు, ఎస్.చంద్రకళ, రేంజర్ స్నేహలత పాల్గొన్నారు.



సత్తుపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

డేంజర్ జోన్‌లో భద్రాచలం

(3వ పేజీ తరువాయి)

వర్గాల ద్వారా తెలుస్తోంది. 1969 ఏప్రిల్ 13న గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని పర్ణశాలలో వచ్చిన భూకంపం రెక్టర్ స్కేలుపై 5.5గా నమోదైంది. కాగా చివరిసారిగా 2018ఆగస్టు 15న ప్రకంపన తీవ్రత 3.8గా నమోదైనట్టు ఆనాడు సిస్మోగ్రాఫ్ ద్వారా తెలిసిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మళ్లీ ఆరేళ్ల తరువాత భూకంప ప్రకంపనలు రాగా అవి సాధారణ స్థాయిలోనే ఉండడంతో నష్టం జరగలేదు.

భూకంపాలు రావడానికి కారణం ఇదే..

గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని భద్రాచలం పరిసర ప్రాంతాలు ఎప్పుడూ భూకంప డేంజర్ జోన్‌లోనే ఉంటాయని, గతంలోనే అధికార వర్గాలు పేర్కొన్నాయి. అసలు భూకంపాలు రావడానికి కారణం ఇక్కడ కొన్ని మిలియన్‌ల సంవత్సరాల క్రితం ఒక లోయలా ఏర్పడి భారీ బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయని గతంలో ఎన్‌జీఆర్‌ఐ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనగేష్ పేర్కొన్నారు. దాంతో అక్కడ ఒత్తిడి పెరిగి భూకంపాలు ఏర్పడుతున్నాయి. ఎక్కువగా ఈ పరిసర ప్రాంతాల్లోనే నమోదవుతున్నాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో 1969 ఏప్రిల్ 13న వచ్చిన భూకంపం రెక్టర్ స్కేలుపై 5.5గా నమోదైంది. అదే ఇప్పటివరకు అత్యధికంగా తెలుస్తోంది.

కొత్తగూడెంలో నమోదు కేంద్రం

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో గత ఐదు దశాబ్దాలుగా తరచూ భూకంపాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రిక్టర్ స్కేలుపై సైతం పలుమార్లు నమోదు అవుతుండటంతో 2007లో కొత్తగూడెం కేంద్రంగా భూకంపాల నమోదు కేంద్రాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.

ఎప్పుడు వస్తుందో చెప్పలేరు

భూకంపం ఏ రోజున, ఏ సమయంలో వస్తుందనే విషయం ఎవరూ చెప్పలేరు. గత 50ఏళ్లలో నమోదు చేసిన గణాంకాల ప్రకారం దేశంలో భూకంపం ఎక్కడ సంభవిస్తుందో 95 శాతం కచ్చితంగా చెప్పగలమని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ అధికారులు గతంలో ప్రకటించారు. కానీ ఏ సమయంలో వస్తుందో తెలుసుకునే పరిజ్ఞానం ఏ దేశంలోనూ నేటివరకు అందుబాటులో లేదు. సమీప భవిష్యత్తులో సైతం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించే అవకాశాలు తక్కువేనని అధికారులు పేర్కొంటున్నారు.

నిపుణుల సూచనలు

భూకంప ప్రభావిత ప్రాంతమైన గోదావరి పరీవాహక ప్రాంతంలో భూకంప ప్రభావం అధికంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నా.. బహుళ అంతస్థుల నిర్మాణదారులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భద్రాచలంలో బహుళ అంతస్థుల నిర్మాణాలు ఏటా పెరుగుతున్నా.. జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తల హెచ్చరికలను పరిగణలోకి తీసుకోవటంలేదు. బహుళ అంతస్తుల్లో పార్కింగ్‌లను పైభాగంలో ఏర్పాటు చేసుకోవాలని వారు స్పష్టంగా సూచిస్తున్నారు. అయితే ఈ విధంగా బహుళ అంతస్తుల నిర్మాణాల్లో పార్కింగ్ లేదన్నది అక్షర సత్యం. నిపుణుల సూచనల మేరకు నిర్మాణాలు చేపడితే భూకంపాలు వస్తే ఆ సమయంలో నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కాళ్ల కింద నేల.. కంపించిన వేళ...

(3వ పేజీ తరువాయి)

భూకంపంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అటు గోదావరి పరీవాహక ప్రాంతంలోనూ, కృష్ణా పరీవాహక ప్రాంతంలో విస్తరించి ఉంది. ములుగుకేంద్రంగా గోదావరి లోయ ప్రాంతంలో ఏర్పడిన భూకంపం తీవ్రత కృష్ణాపరివాహక ప్రాంతంలో కనిపించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఖమ్మం జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో పలుసార్లు భూకంపాలు వచ్చాయి. 1969 ఏప్రిల్ 13న భద్రాచలం కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై 5.7 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. గోదావరి లోయ ప్రాంతం జోన్-3 లో ఉంది. 2004 జులై 6న కూడా భద్రాచలం నుంచి 15కి.మీ. దూరంలో బూర్గంపాడు కేంద్రంగా 70 కి.మీ. ప్రాంతం భూమి కంపించింది. పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో భూకంప తీవ్రత 3.7గా నమోదైనట్టు కొత్తగూడెంలోని భూకంప పరిశోధన కేంద్రంలో నమోదైంది. అప్పట్లో కొత్తగూడెం వద్ద భూకంప తీవ్రత గుర్తించే నమోదు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అప్పుడు కూడా ఉదయం 7-37 గంటల ప్రాంతంలోనే భూమి రెండుసార్లు కంపించింది. ఈసారి ఉదయం 7-27గంటలకు మూడుసెకన్ల పాటు భూమి కంపించింది. దేశంలో భూకంప ప్రభావిత జోన్లలో హిమాలయ బెల్ట్, ఇండోబర్మా ఆర్క్, భుజ్ రీజియన్, నర్మదా, కోయినా రీజియన్‌తో పాటు రాష్ట్రంలో గోదావరి లోయ భూకంప ప్రభావిత ప్రాంతంగా ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్తలు గుర్తించారు.

భూమిలో ఏదో దొర్లినట్లు అనిపించింది...

కిరణ్ జోసఫ్, చర్చికాంపౌండ్, ఖమ్మం



నాకు ఇది కొత్తగా అనిపించింది. టీ తాగుతుండగా కాళ్ల కింద భూమిలోంచి ఏదో దొర్లుకుంటూ వెళుతున్నట్లు అనిపించింది. ఒక రెండు మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. గోడకు ఉన్న ఫొటోలు కదిలాయి. చక్కగా ఉన్న ఫొటోలు వంకరగా కదలడంతో భయంగా అనిపించింది.

ప్రకంపనలు వచ్చాయి..

చిరుమామిళ్ల నాగేశ్వరరావు, ఖమ్మం



ఖమ్మంలోని 12వ డివిజన్ రాధాకృష్ణ నగర్‌లో నేను మా ఇంటివద్ద కూర్చీలో కూర్చున్నాను. ఉదయం ఏడున్నర గంటల సమయంలో కుర్చీ అటూ ఇటూ కదిలి వైబ్రేషన్స్ వచ్చాయి. ఏమీ అర్థం కాలేదు. తర్వాత భూకంపం వచ్చిందని తెలిసింది.

బంగ్లాలో హిందువులకు రక్షణ కల్పించాలి

- హిందూ ధర్మ రక్షాసమితి సంఘీభావ ర్యాలీ

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులకు తగిన రక్షణ కల్పించాలని హిందూ ధర్మ రక్షాసమితి నేతలు, ఇస్కాన్, వికాస తరంగిణి, తదితర హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై తలెత్తుతున్న దాడులు అరికట్టాలని వారికి తగిన భద్రత కల్పించాలని కోరుతూ హిందూధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్‌గ్రౌండ్ నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. హిందూ ధర్మ రక్షా సమితి నేతలు కాటేపల్లి లక్ష్మీనారాయణ, బోనాల రామకృష్ణ, కీసర జయపాల్ రెడ్డి, తాండ్రవినోద్‌రావు, శీలం పాపారావు, నేరేళ్ల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో ఇటీవల బంగ్లాదేశ్‌లో స్థానిక హిందువులపై అత్యాచారాలు, దాడులు వంటి హింసాత్మక సంఘటనలు అధికం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు సేవలందిస్తున్న ఇస్కాన్ సమితిపై దాడులకు దిగి స్వామీజీని అరెస్టు చేసి జైలుకు పంపారని అన్నారు. ఇప్పటికైనా భద్రతను కట్టుదిట్టం చేయాలని డిమాండ్ వారు చేశారు.

బుగ్గపాడు ముస్తాబు

(3వ పేజీ తరువాయి)

సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల నుంచి బుగ్గపాడు వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ జన సమీకరణ, మోటార్ సైకిల్ ర్యాలీ విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు.

విజయోత్సవాల్లో ఫుడ్ పార్కు ప్రారంభం

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఫుడ్ పార్కును ప్రారంభించాలని తద్వారా ఇక్కడ పరిశ్రమలు ఆహ్వానించాలనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు టీజీఐఐసీ అధికారులు ఫుడ్ పార్కు ఓపెనింగ్‌కు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ పార్కుపై అవగాహన కలిగించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఐఐసీ అధికారులకు సూచనలు చేసారు. ఏర్పాట్లలో ఐఐసీ అధికారులకు ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సహకరిస్తున్నారు. కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ సభా స్థలంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

హాజరు కానున్న మంత్రులు

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గురువారం జరగనున్న సభకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఫుడ్ పార్కును మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి మంత్రులు హెలీకాప్టర్‌లో సభాస్థలానికి నేరుగా చేరుకోనున్నారు.

ఉక్కపోత... ఆపై కరెంట్‌కోత

(3వ పేజీ తరువాయి)

ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మం నగరానికి వచ్చిన ఏఈలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. పైస్థాయిలోని అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండానే భవన నిర్మాణ కాంట్రాక్టర్లతో లాలూచీ పడి పోల్ షిఫ్టింగ్‌లు, త్రీఫేస్ కరెంట్ తీగలు మార్పులు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తులు, కొత్త మీటర్లు ఏర్పాటు కొసం కాంట్రాక్టర్లుకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఇష్టానురీతిగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు.

ఖమ్మం నగరంలోని బల్లేపల్లి, పాండురంగాపురం, త్రీ టౌన్, రెండో పట్టణ ప్రాంతాల్లో రోజుకు ఐదుసార్లకుపైగా అప్రకటిత విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయి. గతంలో ఖమ్మంలో పనిచేసిన విద్యుత్‌శాఖ అధికారులు వారంలో ఒక రోజు మాత్రమే మెయింటెనెన్స్‌కు తీసుకొని ముందస్తుగా ప్రకటించి అధికారికంగా విద్యుత్ కోతలు అమలు చేసేవారు. ఇప్పటికైనా జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతల తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలపై విద్యుత్‌శాఖ ఏడీఈ సంజయ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అత్యవసర సమయంలోనే విద్యుత్ కోతలు జరుగుతున్నాయని, పైస్థాయి అధికారుల దృష్టికి రాకుండా ఎల్సీలు తీసుకోవటంపై వివరణ తీసుకుంటామన్నారు.

అమ్మకు అండగా...

(3వ పేజీ తరువాయి)

సహాయకులను సురక్షితంగా ఇళ్లకు చేరవేస్తున్నారు. విపత్తు వేళ అమ్మకు అండగా 102 వాహనాలు నిలుస్తున్నాయనడంలో సందేహంలేదు. జిల్లాలో 11వాహనాల ద్వారా గత మూడు నెలల్లో 8,898 మంది మహిళలను ఆయా ఆస్పత్రులకు తీసుకొచ్చి ఆరోగ్యపరీక్షలను నిర్వహించారు. మొత్తం 3,169 ట్రిప్పులతో గర్భిణులను, బాలింతలను ఆయా గ్రామాల నుంచి తీసుకొచ్చి వైద్యపరీక్షలను నిర్వహించారు. గర్భం దాల్చిన మహిళలకు వైద్య పరీక్షలన్నీ ఈ వాహనాల ద్వారా అందుబాటులోకి రావడంతో ప్రతి నెలా ఎలాంటి ఖర్చు లేకుండా పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. పరీక్ష సమయాన్ని ఆశా కార్యకర్తల దృష్టికి తీసుకెళ్తే ఆమె వాహనాల ద్వారా ఆయా ఆస్పత్రులకు తీసుకెళ్లి పరీక్షలు పూర్తి చేసిన తర్వాత తిరిగి ఇంటి వద్ద వదిలిపెడుతున్నారు.

కేంద్ర 'నక్షా'లో మణుగూరు ప్రాంతాలు

మణుగూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వేలో మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలను సర్వే నక్షాలో తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ జియో స్పెషియల్ నానెడ్జి బేస్‌డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కింద పలు ప్రాంతాలను గుర్తించి నక్షాను రూపొందించనున్నారు. రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే, మునిసిపాలిటీ సర్వే ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో సర్వేనిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గల నెలలో దేశ వ్యాప్తంగా 100 పట్టణాల్లో నక్షా రూపొందించేందుకు నిధులను విడుదల చేసింది. ఇందులో బాగంగా తెలంగాణా రాష్ట్రంలో ఎనిమిది పట్టణాలను ఎంపిక చేశారు. వీటిలో మిర్యాలగూడెం, జగిత్యాల, మణుగూరు, జడ్చర్ల, హుస్నాబాద్, కొడంగల్, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఉన్నాయి. ఈ పథకంలో ప్రతి ఇల్లు, ఆస్థిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు రేఖాంశాలతో ఆస్తులను గుర్తించి వాటివిస్తీర్ణాన్ని డిజిటల్‌లో నమోదు చేస్తారు, తర్వాత ఈ ఆస్తులకు సంబంధించి కార్డులను కూడా జారీ చేయనున్నారు. ఇప్పటి వరకు సరైన ఆధారాలు లేని ఇళ్ల విలువ ఈ నక్షా ప్రకారం పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల బ్యాంకు రుణాలు పొందేందుకు మార్గం ఏర్పడనుంది, బస్తీలు మురికి వాడలు చిన్న చిన్న ఇళ్ల స్థలాలకు ధ్రువీకరణ పట్టాలు కూడా రానున్నాయి. ఈ నెల చివరి నాటికి పైలట్ సర్వే పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్‌లో 142 పట్టణాల్లో నక్షా సర్వే చేపట్టే ప్రణాళిక కేంద్రం ఉన్నట్లు తెలిసింది.

ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణాలు, వసతులు పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 135 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తయ్యాయని, సౌకర్యాలతో లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటి కోసం గుర్తించిన అర్హుల జాబితా నుంచి, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నిరుపేదల ప్రాతిపదికన జాబితా ఎంపిక చేసి శనివారంలోగా అందజేయాలన్నారు. ఖమ్మం అర్బన్‌లో నిర్మాణాలు పూర్తయి కేటాయింపునకు సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో 4 ఇళ్లను ట్రాన్స్‌జెండర్లకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణాలు పూర్తయి, లబ్ధిదారులకు అందజేతకు సిద్ధంగా ఉండి, అర్హుల జాబితా సిద్ధం కాని ఇళ్లు 470 ఉన్నాయన్నారు. వీటిలో స్వీకరించిన దరఖాస్తుల విచారణ పూర్తి చేసి, జాబితాను రెండు వారాల్లో సమర్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి, కనీస సౌకర్యాల కల్పన చేయాల్సిన ఇళ్లు జిల్లాలో 635ఉన్నాయని వాటిలో కనీస సౌకర్యాల కల్పనకు కావాల్సిన నిధులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లాలో నిర్మాణాలు పూర్తికాక, వివిధ స్థాయిల్లో ఉన్న నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత నిర్మాణదారులతో మిగులు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులు గ్రౌండింగ్ అయి, పాక్షికంగా నిర్మాణాలు జరిగిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు జిల్లాలో 702ఉన్నాయని వీటి పూర్తికి నిధుల వివరాలు సమర్పించాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జడ్పీసీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మధిర అయ్యప్ప దేవాలయంలో అన్నదానానికి తరలివచ్చిన మాలధారులు

అన్నదాన ప్రభువే..

- 12ఏళ్లుగా అయ్యప్ప మాలధారులకు భిక్ష
- మధిర అయ్యప్ప దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహణ

మధిర రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది అయ్యప్ప మాలధారులకు నిత్యం మధ్యాహ్న సమయంలో దేవాలయం నిర్మాణకర్తలు, నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు అన్న వితరణ చేస్తున్నారు. కొంతమంది దాతల సహకారంతోపాటు సొంత ఖర్చులతోనే మధిర అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం చేస్తున్నారు.

ఏటా నిర్వహణ

ఈ ఏడాది నవంబరు రెండోతేదీన ఈ అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప దేవాలయంలో ప్రారంభించారు. డిసెంబరు 26వతేదీ వరకు సుమారు 56రోజులపాటు ప్రతి సంవత్సరం ఈ అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమానికి ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటుచేశారు. మధిర పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అయ్యప్పమాల ధరించిన వారు ఇక్కడకు వచ్చి భిక్ష చేసి వెళ్తుంటారు.

పుష్కర కాలం క్రితం ప్రారంభం

మధిరకు చెందిన చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు సోదరులు అయ్యప్ప దేవాలయం నిర్మాణం చేపట్టడంతోపాటు మాలధారులకు అన్నవితరణ చేయాలనే ఉద్దేశ్యంతో గత 12సంవత్సరాల క్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నిరంతరాయంగా చేస్తున్నారు. నిత్యం 500మందికిపైగా అయ్యప్పలు ఇక్కడకు వచ్చి సద్ది చేస్తుంటారు. వర్షం పడినా ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు అన్నవితరణ కొనసాగుతూనే ఉంటుంది. ఎవరైనా దాతలు అన్నవితరణకు సాయం చేస్తే తీసుకుంటూ ఆసహాయం కాకనే వీరి సొంత ఖర్చులతోనే ఎక్కువ మొత్తంలో వితరణ చేస్తున్నారు. మధిర ప్రాంతంలో ఈ అన్నవితరణ కార్యక్రమానికి అయ్యప్పల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

మహా అన్నదానం కూడా..

ప్రతీ సంవత్సరం ఆలయ ప్రాంగణంలో పదివేల మంది ప్రజలకు కూడా మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఆకార్యక్రమాన్ని ఈనెల నాల్గోతేదీన ఏర్పాటుచేశారు. అన్నదాన కార్యక్రమానికి అయ్యప్పలు పెద్ద సంఖ్యలో తరలి వస్తుండటంతో స్వామియే శరణం అయ్యప్ప శరణం నినాదాలతో ఈ ప్రాంగణం మారుమోగుతోంది.



అన్నదానం దేవుని కృపగా భావిస్తున్నాం

శ్రీనివాసరావు, అయ్యప్ప దేవాలయ ట్రస్టీ

12సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయటం దేవుని కృపగా భావిస్తున్నాం. ప్రతీ సంవత్సరం మధిరలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో మాలధారులకు అన్నదానం జరుగుతుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే అయ్యప్పలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశాం. ఈ కార్యక్రమానికి కొంతమంది దాతలు కూడా సహకరిస్తున్నారు.

రామయ్య సేవలో

ఎస్పీ దంపతులు



భద్రాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు దంపతులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలుకగా అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా పాల్గొన్నారు. ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా సుదర్శన హోమం, గోపూజ, శ్రీరామ నామ మహిమ అనే అంశంపై శ్రీరామాయణ పారాయణదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు ప్రవచనాన్ని అందించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో మెడ్‌ప్లస్ మెడికల్ షాప్, హైదరాబాద్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి తెలిపారు. మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ 40 ఉద్యోగ ఖాళీలు, సీఎస్ఏ 50 ఖాళీలు, జూనియర్ అసిస్టెంట్ 100 ఖాళీలు, ఆడిట్ అసిస్టెంట్ 30 ఖాళీలలో ఉద్యోగాలు భర్తీ చేయుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం, ఉచిత వసతి, సేల్స్ ఇన్సెంటివ్స్ ఉంటాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల డిప్లొమా ఫార్మసీ, బ్యాచిలర్ ఫార్మసీ, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హతఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు. వివరాలకు 9346991009 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాజీ మార్గమే రాజమార్గం..

- 4న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవాసంస్థ చైర్మన్ టి.రాజగోపాల్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయసేవాధికారసంస్థ హాల్లో ఈ నెల 14న చేపట్టబోయే జాతీయ లోక్ అదాలత్ నార్వహణపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు, రాష్ట్రహైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయసేవాసంస్థ సహకారంతో కేసులను పూర్తిచేసుకోవచ్చని ఆయన తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృథా అన్నారు. గత లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 10712 కేసులు పరిష్కరించి, రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ కోర్టులలో 6277 కేసులు గుర్తించామని, ఇంకా కేసులు గుర్తించి, గత లోక్ అదాలత్ కంటే ఎక్కువ కేసుల పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 14న వివిధ కోర్టుల్లో లోక్ అదాలత్ ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్‌చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయాధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం హోరాహోరీగా నిర్వహించారు. రైల్వే ఇనిస్టిట్యూట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తొలిరోజు 351 మంది ఓటు వేశారు. ఎన్నికల సరళిని భద్రాచలం రోడ్ రైల్వే ఏరియా అధికారి రామ్ భజన్ మీనాను ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ఐదు కార్మిక సంఘాలు పోటీ పడుతుండగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం 828 మంది ఓటర్లు ఉండగా మరో రెండు రోజులు నేడు, శుక్రవారాలు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్ వద్ద రైల్వే పోలీసులతో పాటు కొత్తగూడెం సివిల్ పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ..

జూలూరుపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని టాటామ్యాజిక్ (ట్రాలీ) ఢీకొన్న సంఘటనలో బావ, బావమరిదికి తీవ్ర గాయాలయ్యాయి. చండ్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన బాణోత్ రవి, దారావత్ రత్న బావ బామర్దులు కలిసి మిర్చితోటకు పురుగుమందును తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్లారు. పురుగు మందును కొనుగోలుచేసి తిరిగి ఇంటికి పోకలగూడెం వెళ్తున్న క్రమంలో అనంతారం గ్రామ సమీపంలో చండ్రుగొండ నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న టాటా ఏసీ వాహనం జూలూరుపాడు నుంచి చండ్రుగొండ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్సలను అందించేందుకు వారిని 108లో కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు.

వన్యప్రాణులను వేటాడటం నేరం

- డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్

సత్తుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అడవులను సంరక్షించడం మనం బాధ్యతగా తీసుకోవాలని, వన్యప్రాణులను వేటాడటం నేరమని డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్ పార్క్‌లో పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం అటవీ సిబ్బందితో సమావేశమయ్యారు. అటవీ ప్రాంతంలో జంతుజీవాలకు తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లయితే జనావాసాలలో రావని, కోతుల కోసం అడవులలో పండ్ల మొక్కలు పెంపకం విరివిగా చేపట్టాలని సూచించారు. వచ్చే సీజన్‌లో ఆకులు రాలినప్పుడు బ్లోయర్లతో శుభ్రం చేసినట్లయితే మంటలు అంటుకున్నప్పుడు ఎక్కువ ప్రమాదం వాటిల్లకుండా చూడవచ్చన్నారు. పశువుల కాపరులు అటవీ ప్రాంతానికి వెళ్లిన సమయంలో బీడీలు, సిగరెట్లు కాల్చి పడేసేటప్పుడు ఆర్పివేయాల్సి ఉంటుందని, ఇందుకోసం ముందుగానే గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రధాన సెంటర్లలో ఫైర్ సమాచారాన్ని చేరవేసేందుకు ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని, గుడులు, అడవులలో విహారయాత్రల సమయంలో వంటలు పూర్తయ్యాక పూర్తిగా ఆర్పివేయాలని, లేకుంటే నిప్పురవ్వలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. వరి, పత్తి, ఇతర పంటలు పూర్తయిన తర్వాత దహనం చేస్తున్న క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఎఫ్‌వో

క్రైం సమాచారం

ట్రాక్టర్ టైర్ కిందపడి చిన్నారి దుర్మరణం



అశ్వాపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ టైర్ కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన బుధవారం ఆళ్లపల్లి మండలంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ఆళ్లపల్లి మండలం, అనంతోగు గ్రామానికి చెందిన గళిగే నరేష్, కృష్ణవేణి దంపదతుల పెద్దపాప కిరణ్య(4). బుధవారం తన నానమ్మ మొక్కజొన్న కంకుల బస్తాలు మోసేందుకు కూలికి వెళుతుండగా ఆమెతో ట్రాక్టర్‌లో వెళ్లింది. కూలీలు అందరు కంకుల బస్తాలను ట్రాక్టర్‌లో వేసి ఒక్క చోట చేర్చుతున్న క్రమంలో కిరణ్యా ట్రాక్టర్ డ్రైవర్ పక్కకు కూర్చుంది. ట్రాక్టర్ స్టార్ట్ అయి వెళుతుండగా డ్రైవర్ పక్కన కూర్చున్న కిరణ్య ప్రమాదవశాత్తు జారి కింద పడగా, ట్రాక్టర్ టైరు పాప తల పైనుంచి ఎక్కిపోయింది. దాంతో కిరణ్యా తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. కిరణ్యా మృతితో తల్లితండ్రులు, నానమ్మ, తాతయ్య ఏడుస్తున్న తీరుతో అనంతోగులో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి విక్రయదారులకు రిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువతకు గంజాయి మత్తును అలవాటు చేస్తూ వారికి అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల్ని ఖమ్మం టు టౌన్ ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ పట్టుకొని రిమాండ్ చేసినట్లు ప్రకటించారు. ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురానికి చెందిన షేక్ ఇస్మాయిల్‌పాషా, నారపోగు సాకేత్, తాటికొండ సాయికృష్ణ ముఠాగా ఏర్పడి మారుబేరంగా అక్రమంగా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నారు. బుధవారం ఖమ్మంలోని సారథి నగర్, ఎఫ్‌సీఐ గోదాం ప్రాంతంలో యువకులకు గంజాయి విక్రయిస్తుండగా సీఐ చంద్రమోహన్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ముగ్గురు నిందితులతో పాటుగా రెండు ద్విచక్ర వాహనాలు, 150గ్రా. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సిబ్బంది ఎన్. నరేందర్, కె. వీరభద్రరావు, ఎస్కే మౌలాంకర్, బి. నర్సింహారావు, వి. గురుప్రసాద్, కె. రాధ పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో గంజాయి పట్టివేత

దుమ్ముగూడెం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండల లక్ష్మీనగరం గ్రామ శివార్లలో బుధవారం ఉదయం జిల్లా ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సినీ ఫక్కీలో గంజాయిని పట్టుకున్నారు. కారులో దుమ్ముగూడెం మండలం మీదుగా వరంగల్ వైపుగా గంజాయి తరలివెళ్తోందని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. దుమ్ముగూడెం పోలీసుల సహకారంతో రహదారిపై ప్రైవేటు బస్సును అడ్డుపెట్టి కారును అడ్డగించారు. అందులోని ముగ్గురు వ్యక్తులు కారు దిగి పారిపోగా, డ్రైవింగు చేస్తున్న వ్యక్తి దొరికాడు. కారు బానెట్‌లో నుంచి ప్యాక్ చేసిన సుమారు మూడు నుంచి నాలుగు కేజీల గంజాయి దొరికినట్లు తెలుస్తోంది. వ్యక్తితో సహా కారును స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇల్లెందు ఎక్సైజు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్‌రావు మృతి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు , బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోరే భాస్కర్‌రావు(52) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. శ్వాసతో ఇబ్బంది కలగడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు.సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు భౌతిక దేహానికి దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీ రవిచంద్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా..

తల్లాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తాపడి ఐదుగురికి గాయాలయ్యాయి. మంగాపురం గ్రామంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమానికి తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన భక్తులు ఆటోలో వెళ్లారు. ఇరుముడి కార్యక్రమం ముగిసిన అనంతరం మంగాపురం నుంచి ఆటోలో స్వగ్రామమైన మల్లవరంకు బయల్దేరారు. మార్గమధ్యలో నారాయణపురం ముత్యాలమ్మగుడి సమీపంలో మలులపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుగ్గిదేవర నాగబాబు, ఆటోలో ప్రయాణిస్తున్న గాదె శివమ్మ, మూలగుండ్ల కళావతి, నీలం మంగమ్మ, పూల కృష్ణవేణిలకు గాయాలయ్యాయి.

ఆటో పల్టీ.. కూలీలకు గాయాలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడగా 11 మంది కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఐదుగురిని సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన కూలీలు బుధవారం ఉదయం దమ్మపేట మండలంలోని మల్కారం ప్రాంతంలో కూలి పనులు చేసుకునేందుకు ఆటోలో బయలుదేరారు. ఆటో మండలంలోని తిమ్మాపురం సమీపంలో కుక్క అడ్డురావటంతో ఆటో అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. కూలీలంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో చంటిబాబే, రాము, లక్ష్మి, దేవి, చిలకమ్మతో పాటు మరికొంతమందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని సత్తుపల్లికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్‌తో పాటు పలువురు ఉన్నారు.



ఆసుపత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ట్రాక్టర్, ఆటో ఢీ..

ఖమ్మంక్రైం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆటోను ట్రాక్టర్ ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటనపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదయింది.

చర్చికాంపౌండ్ సమీపంలోని సెయింట్‌మేరీ పాఠశాల సమీపంలో ఆటోను ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ఉన్న నలుగురు గాయపడ్డారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కొణిజర్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో వ్యక్తికి రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో బుధవారం జరిగింది. పల్లిపాడు గ్రామానికి చెందిన షేక్ జానిమియా రోడ్డుప్రక్కన నడుచుకుంటూ వెళ్తుతుండగా ఢిల్లీ నుంచి విజయవాడ వెళ్తున్న లారీ అతివేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి.



బైక్‌ల దొంగను, వాహనాలను చూపుతున్న పోలీసులు

దొంగ అరెస్టు.. ఎనిమిది బైకులు స్వాధీనం

- కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బైకుల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ బుధవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను సీఐ వెల్లడించారు. ఈజీ మనికి అలవాటు పడిన భద్రాచలం పట్టణానికి చెందిన గుమ్మడి రాజు గత కొంతకాలంగా ద్విచక్రవాహనాలను దొంగిలించి, వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సా జీవితాన్ని గడుపుతున్నాడు. మంగళవారం రాత్రి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వన్‌టౌన్ పోలీసులు వాహనాల సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా రాజు ప్రవర్తన అనుమానస్పదంగా కనిపించింది. అతణ్ని పోలీసులు ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. ఇటీవల ఖమ్మంలో రెండు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు అంగీకరించాడు. రాజును పోలీసులు అరెస్టు చేసి ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగను అదుపులోకి తీసుకోవడంలో కృషి చేసిన సీఐ కరుణాకర్, కానిస్టేబుల్ శంకర్, సురేష్, నరేష్‌లను డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ప్రత్యేకంగా అభినందించారు.

సరిహద్దు తగాదాలో పరస్పరం దాడులు

దమ్మపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సరిహద్దు తగాదాలో పరస్పరం దాడులలో కొందరు గాయపడిన ఘటన నాగుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. నాగుపల్లి గ్రామానికి చెందిన చీకటి వెంకయ్యకు, గండా ముత్యాలరావుకు గత కొంతకాలంగా ఇరుకుటుంబాల మధ్య సరిహద్దు వివాదం జరుగుతోంది. మంగళవారం రాత్రి మాటా మాటా పెరిగి దాడులకు దారితీసింది. ఈఘటనలో ముత్యాలరావు తండ్రి దేవయ్యకు కంటి సమీపంలో గాయంకాగా రక్తస్రావం జరిగింది. చీకటి వెంకయ్యకు సంబంధించిన వారికి స్వల్పంగా గాయపడ్డారు. ఇరువురు బుధవారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

అశ్వాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓయువకుడిపై బుధవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం రామచంద్రాపురం గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నడన్న ఫిర్యాదు మేరకు అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నగదు, బంగారం అపహరణ

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి రూ.ఐదులక్షల నగదు, మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటి యజమాని పరిశీలించగా దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి నగదు, బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇంటి యజమాని అఫ్జల్ తన భార్యకు అనారోగ్య కారణంగా హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లాడు. హైదరాబాద్ వెళ్లిన విషయాన్ని గమనించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు అఫ్జల్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. చోరీ జరిగిన ఇంటిని ఏసీపీ ఎంఏ రెహ్మాన్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రంగనాయకమ్మ కన్నుమూత



తిరుమలాయపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధురాలు రంగనాయకమ్మ(100) బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు మతిచెందారు. ఆమెకు కుమార్తె ఉన్నారు. ఆమె తెలంగాణసాయుధ పోరాటంలో రంగనాయకమ్మ చురుగ్గా పాల్గొన్నారు. ఈప్రాంతంలో భూస్వాములు, పెత్తందారులక వ్యతిరేకంగా జరిగినపోరాటంలో ఆమె పాల్గొన్నారు. కాగా ఆమె భౌతికకాయాన్ని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు రాయల రవికుమార్, కె.నాగేశ్వరరావు, యడ్లపల్లి నవీన్, రాయల ప్రసాద్ , గుర్రం అచ్చయ్య తదితరులు నివాళులర్పించారు.

ఆత్కూరులో పట్టుబడిన పశువుల దొంగ

- సీసీ పుటేజీ ఆధారంగా గుర్తింపు

మధిర రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలో పట్టపగలే ఓ వ్యక్తి పశువులను దొంగతనం చేసేందుకు రాగా ఆ ఇంటి యజమానే పట్టుకొని బుధవారం మధిర టౌన్ పోలీసులకు అప్పగించారు. మధిర మండలం ఆత్కూరు గ్రామంలోని బీసీ కాలనీలో మల్లా భాగ్యమ్మ తనకున్న రెండు ఆవులను, మూడు దూడలను తన ఇంటి వెనుక ఆవరణంలో కట్టేసి ఉంచింది. బుధవారం ఉదయం 11గంటల సమయంలో పశువుల దొంగ అక్కడకు వచ్చి ముందుగా కట్టేసి ఉన్న రెండు ఆవులను, దూడలను ఆగ్రామసమీపంలోని క్రషర్ మిల్లు వద్దనున్న పొలానికి గుట్టుచప్పుడుగా తరలించాడు. దీన్ని భాగ్యమ్మ కుమారుడైన మల్లా వీరబాబు తన ఫోన్‌లో గమనించి సోదరుడు నవీన్‌కు సమాచారం అందించాడు. నవీన్ వెతుక్కుంటూ పొలాల వైపు వెళ్లగా ఓ చోట ఆటోలో ఓ గుర్తుతెలియని వ్యక్తి తమ ఆవులు, దూడలను ఎక్కించటాన్ని గుర్తించాడు. వెంటనే అతణ్ని పట్టుకొని మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని మెదక్ జిల్లా పటాన్‌చెర్వు డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీవాసిగా గుర్తించారు.



రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
కాకరకాయ	28
బెండకాయ	20
పొట్లకాయ	38
దొండకాయ	30-38
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	28
క్యాబేజీ	34
దోస	28-38
సొరకాయ	20
క్యారెట్	68
క్యాప్సికం	54
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కేశవ చంద్రరమావత్
తిరుమల:	రోటీ కపడా రోమాన్స్
సినీ గెలాక్సీ:	జీబ్రా

యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కోటేష్‌నాయక్



ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బానోత్ కోటేష్‌నాయక్ ఎన్నికైనారు. ఇటీవల అంతర్గతంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు జరగాయి. కాగా బుధవారం ఫలితాలు వెలువడ్డాయని ఆయన ప్రకటించారు.

జిల్లా జనరల్ సెక్రటరీగా క్రాంతికుమార్



యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా కే క్రాంతికుమార్ ఎన్నికైనారు. సం ఘం అంతర్గతంగా జరిగిన ఎన్నికల్లో జనరల్ సెక్రటరీకి 18నామినేషన్‌లు వేశారు. కస్తాల క్రాంతికుమార్‌కు 5,879 ఓట్లు కైవాసం చేసుకున్నారు.

కామేపలి మండల అధ్యక్షుడిగా వేణు



కామేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన దొడ్డ వేణు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నిక అయినట్లు ప్రకటించారు. అంతే కాకుండా కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన మాలోత్ ప్రేమ్‌కుమార్ ఇల్లెందు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైయ్యారు. మండల యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆలోత్ మోహన్, బత్తుల వీరబాబు ఎన్నికైయ్యారు.

కామేపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా సీతారాములు

కామేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా భూక్య సీతారాములు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపిస్తామని అన్నారు. అభినందించిన వారిలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, అజ్మీరా రాందాస్, కొర్ర రాములు, బండి నర్సింహరావు, అర్జున్ తదితరులు ఉన్నారు.

11న సీపీఎం డివిజన్ మహాసభ

కామేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలో 11న జరిగే సీపీఎం డివిజన్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు దుగ్గి క్రిష్ణ కోరారు. మండల పరిధిలో ముద్దులపల్లి గ్రామంలో కాటినేని క్రిష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలం చెందిందని అన్నారు. అమలు అయ్యేవరకు సీపీఎం పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, వింజం నాగభూషణం, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య రాయల సత్యానారయణ, నాగేశ్వరరావు, దేగల రాంబాబుపాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

- బస్సులు సరిపోక ప్రయాణికుల ఇబ్బందులు
- బస్‌డిపో ఎదుట ధర్నా
- 9న బస్‌భవన్ ముట్టడి
- మాస్‌లైన్ జిల్లా అధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వర్లు



బస్‌డిపో ఎదుట ఆందోళన చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట ప్రభుత్వం ప్రకటించిన పథకము నీరు గారి పోతుందని సరైన బస్సులు లేకపోవడం కారణంగా మహిళలు విద్యార్థినిలు నిరుద్యోగులు ఆ పథకాన్ని సరిగా వినియోగించుకునే పరిస్థితి లేదని ప్రయాణికుల సంఖ్య కనుగుణంగా బస్సులు పెంచాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఖమ్మం బస్ డిపో ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అనే అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని గ్రామీణ ప్రాంతాల నుంచి విద్య ఉపాధి హాస్పిటల్స్ వచ్చేందుకు సరైనటువంటి బస్సు సర్వీసులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్రీ టికెట్ మహిళా లపై కండక్టర్లు దురుసు ప్రవర్తన కూడా అక్కడక్కడ జరుగుతున్నాయాన్నే వీటన్నిటిని నిరోధించలని కోరారు. బస్సుల సంఖ్య పెరగకపోవడం వల్ల ఓవర్ లోడ్ అవుతుందని దీని కారణంగా స్టేజీలలో బస్సులు ఆపడానికి వీలు కావడం లేదని తక్షణమే అధిక బస్సులు కొనుగోలు చేసి ప్రజా రవాణాన్ని మెరుగు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల తొమ్మిదో తారీఖున బస్సు భవనం ముట్టడి కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు ,రామయ్య ,ఆవుల అశోక్, బండెల వెంకయ్య శిరోమణి, మంగతాయ్, ఝాన్సీ, శోభ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ రామయ్య కన్నుమూత



నివాళులర్పిస్తున్న రాయల నాగేశ్వరరావు(ఇన్‌సెట్‌లో రామయ్య ఫైల్)

తిరుమలాయపాలెం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ ఎంపీపీ ఊడుగు రామయ్య (90) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. రామయ్య మండల వ్యవస్థ ఏర్పడిన అనంతరం తొలి ఎంపీపీగా ఎన్నికయ్యాడు. కాగా ఆయన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సన్నిహితంగా ఉంటాడు. కాంగ్రెస్‌పార్టీలో చురుగ్గా వ్యవహరించాడు. కాగా ఆయన భౌతికకాయాన్ని గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావావెంకటేశ్వరరావు, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, కర్నాటి శ్రీను, వేముల ఉపేందర్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీనునివాళులర్పించారు. రామయ్య అంత్యక్రియలు శుక్రవారం కొక్కిరేణి గ్రామంలో జరుగుతాయని ఆయన కుమారుల ఊడుగు శ్రీనివాసరావు, కొండలరావు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు పాల్గొనాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరుబాట తప్పదు

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ధర్నా

ఖమ్మంటౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే పోరుబాట తప్పదని ఆశా వర్కర్లు హెచ్చరించారు. బుధవారం తెలంగాణా ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మా విష్ణువర్ధన్ మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరులో తమ సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు నిరవధిక సమ్మె చేస్తే సమస్యలు పరిష్కారం కోసం ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కూడా తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆశావర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆశావర్కర్లకు ఇన్సూరెన్స్, ఇతర సదుపాయాలు కల్పిస్తామని వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ కూడా గతంలో హామీ ఇచ్చారన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆశావర్కర్ల సమస్యలు తీరలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ,ప్రమాదబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు పీ.రమ్య, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జే.మంగమ్మ, జిల్లా నాయకులు నాగమణి, రాణి, రాధ, కళ్యాణి, జ్యోతి, కమల, విజయ పాల్గొన్నారు.

విజయవంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే - 2024

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజయవంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024 నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, అకడమిక్ మోనిటరింగ్ అధికారి రవి కుమార్ తెలిపారు. 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల అంచనా కోసం పరఖ్ సంస్థ ఆధ్వర్యములో బుధవారం జిల్లాలో నిర్వహించిన ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో విజయవం తంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమమును కేంద్రప్రభుత్వ అబ్జర్వర్‌గా నియమితు లైన సందీప్ తివారి పర్యవేక్షించారు. జిల్లా డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యానారాయణ సీబీఎస్ఈ జిల్లా కో ఆర్డినేటర్ ఎంపి . రాజన్ జిల్లాలోని వివిధపాఠశాలలను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. 3వ తరగతిలో 40 పాఠశాలల్లో 747 మంది విద్యార్థు లు, 109 మంది ఉపాధ్యాయులు 6వ తరగ తి లో 30 పాఠశాలల్లో 738 మంది విద్యార్థులు 93 మంది ఉపాధ్యాయులు, 9వ తరగతి లో 37 పాఠశాలల్లో 919 మంది విద్యార్థులు 137 మంది ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొన్నారు. సర్వే జరిగిన తరగతులు 107, పాల్గొన్న విద్యార్థులు2,404, ఉపాధ్యాయులు 339 పాల్గొన్నారు.

సీనియర్ మహిళా జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో సీనియర్ మహిళల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 52 మంది మహిళలు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారిణులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. జట్టులో భవాని, అఖిల, స్వప్న, కుసుమ, విజయ, ప్రియాంక, నందిని, చంద్రకళ, పూజిత, హాని, హారిక, అమీనాబేగం, స్టాంబ్‌బైగా నికిత, భావన, కావ్యలను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, క్రిష్టఫర్‌బాబు తెలిపారు.

వీరు డిసెంబరు 7 నుంచి 10 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికలను ఫిజికల్ డైరెక్టర్‌లు సత్యనారాయణ, లాలయ్య, శేఖర్, శోభన్, శివక్రిష్ణ, జ్యోతి, శ్రీను, పద్మ, సుస్మిత నిర్వహించారు.

రేపు రాజ్యాధికారం-మహిళ రిజర్వేషన్లపై సదస్సు

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం రాజ్యాధికారం-మహిళ రిజర్వేషన్లపై సదస్సు నిర్వహిస్తున్నట్టు వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, షేక్ నజీమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసదస్సుకు కులమత రాజకీయాలకు అతీతంగా బహుజన మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంక్రైం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ జాలాది పార్థసారధి కుటుంబానికి 2003 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆర్థికసాయం బుధవారం అందించారు. ఉమ్మడిజిల్లాకు చెందిన మృతుని తోటిబ్యాచ్ సిబ్బంది అసోసియేషన్‌గా ఏర్పడి రూ.2,50,000లు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో తొంట శ్రీను, కిరణ్, కృష్ణ, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, మామిడల శ్రీను, రామయ్య, సతీష్, మల్లేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి: డీఎంహెచ్‌వో



సిబ్బందికి జ్ఞాపికలను అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డీఎంహెచ్‌వో అధికారి డాక్టర్ కళావతీబాయి సూచించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏఆర్టీ సెంటర్‌లో బుధవారం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రతి నిత్యం మందులు వాడుతూ జీవనం కొనసాగిస్తున్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు ప్రోత్సాహకాలు అందించారు. ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తే హెచ్ఐవీ నుంచి కాపాడుకోవచ్చన్నారు. మందులు వాడుతున్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడి తమ జీవన కాలాన్ని పెంచుకోవాలన్నారు. మందులు వాడే వారు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి వెంకటరమణ, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, హెచ్ఐవీకి సంబంధించిన అవగాహన పత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంధర్, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ జయకుమార్, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సిబ్బంది డి సత్యకుమార్, మహమూద్ అలీ, టి వీరయ్య, ఎస్ రామకృష్ణ, ఏఆర్టీ సెంటర్ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు యన్. శంకర్, ఏ సుందర్, కొండల్‌రావు, వి. శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్
- ఖమ్మానికి ఇద్దరు న్యాయాధికారుల నియామకం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

4 కేవీబి-2: నూతన న్యాయాధికారుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

జిల్లాకు ఇద్దరు న్యాయాధికారుల నియామకం

ఖమ్మం లీగల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కోర్టుకు ఇద్దరు న్యాయాధికారులను నియమిచారు. మహిళాకోర్టు న్యాయాధికారిగా వశుకుల శ్రీనయ్య నియమితులయ్యారు. ఈయన నల్గొండ జిల్లా దేవరకొండ మండలం మల్లేపల్లిలో జన్మించారు. ఎల్ఎల్ఎం వరకు చదివారు.

మరో న్యాయాధికారి సీనియర్ సివిల్ జడ్జి శివరంజని హైదరాబాదులో జన్మించారు. మహాత్మగాంధీ లా కాలేజీలో న్యాయవాద విద్యను అభ్యసించారు. వరంగల్, హుస్నాబాద్ నుండు మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహించి పదోన్నతిపై ఖమ్మం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు.

న్యాయాధికారుల పరిచయ కార్యక్రమం

నూతన న్యాయాధికారుల పరిచయ కార్యక్రమం బార్ అసోసియేషన్ హాల్లో అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షత బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి టి.రాజగోపాల్ హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతనూ న్యాయవాదులు సహకారం అందించి త్వరితగతిన కేసుల సత్వర పరిష్కారానికి కృషిచేయాలన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేందుకు కృషిచేయాలని సూచించారు. నూతన న్యాయాధికారులు మాట్లాడుతూ ఎంతో చక్కగా పరిచయకార్యక్రమాన్ని నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమకు సహకరించాలని కోరారు. ఖమ్మంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయధికారులు కె. ఉమాదేవి, వెంపటి అపర్ణ, ఎం.అర్చనా కుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, కె.వి.చంద్రశేఖరరావు, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవి, బార్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మంగాపురం తండాలో భారీ వర్షం

తడిసిన వేల క్వింటాళ్ల ధాన్యం..
నిండా మునిగిన రైతు

నేలకొండపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మంగాపురంతండాలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కాస్తూ ప్రశాంతంగా ఉన్న వాతావరణం రాత్రికి ఒక్కసారిగా మారిపోయింది. ఏకధాటిగా భారీవర్షం కురవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎండకు ధాన్యం ఎండుతుందన్న ఆశతో పట్టాలు కప్పకుండా రైతులు వదిలి ఇళ్లకు వెళ్లిపోయిన అనంతరం వర్షం కురవంతో రోడ్లపై ఆరబోసిన ధాన్యం మొత్తం నీటిపాలైంది. వర్షం రాకతో అప్రమత్తమైన రైతులు పట్టాలు కప్పేసరికే ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం సైతం తడిసినట్లు తెలుస్తున్నది. దాదాపుగా 7-8వేల క్వింటాళ్ల ధాన్యం పైనే తడిసిపోయినట్లు రైతులు చెపుతున్నారు. ఇంట్లోకు వెళ్లాల్సిన ధాన్యం నీటి పాలుగావటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నేడు ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు అవగాహన కోసం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర్‌శర్మ తెలిపారు. 'ప్రశస్త్' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి తద్వారా శారీరక, మానసిక లోపాలతో పాటు విద్యాభ్యాసంలో వెనుకబడిన వారిని సమర్థవంతంగా గుర్తించడం ద్వారా వారికి తగిన ప్రణాళికతో విద్యా బోధన చేయటానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రశస్త్ కార్యక్రమం రెండో దశను ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా నిర్వహిస్తామన్నారు. జిల్లా సీఎంఓ సహిత విద్య జిల్లా సమన్వయకర్త యలగందుల రాజశేఖర్ ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఖమ్మంలోని నయాబజార్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన ప్రత్యేక విద్య ఉపాధ్యాయులతో పాటు తాజాగా ఎస్జిటి నుంచి పదోన్నతి పై స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా హాజరుకావాలని డీఈవో తెలిపారు. పాఠశాల హెచ్ఎం లు ప్రత్యేక విద్య ఉపాధ్యాయులుసకాలంలో శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని తెలిపారు.

నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలి

కేఎంసీ కమిషనర్‌కు సీపీఎం ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో బైపాస్ రోడ్డు కొత్త బస్టాండ్ ప్రాంతంలో నిబంధలను అతిక్రమంచి వ్యాపార సంస్థలు భవనాలు నిర్మాణాలు జరుపుతున్నా యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కేఎంసీ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కనీసం సెల్లార్‌లు లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్నారని సీపీఎం జిల్లా నాయకులు వై విక్రమ్ ఆరోపించారు. కొత్త బస్టాండ్ సమీపంలో నిర్మాణాలు జరుగుతున్న పలు భవనాలపై ఫిర్యాదులు చేశారు. వ్యాపార సంస్థలకు కనీస పార్కింగ్ లేక పోవటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పాడుతున్నాయన్నారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిభందనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బోడపట్ల సుదర్శన్, యాకయ్య, జె వెంకన్న పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామితో నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దుతో పాటు ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పెద్దల సభలో తన గొంతుక వినిపిస్తానని టీఎస్ సీపీఎస్ ఈయూ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి డా.కొలిపాక వెంకటస్వామి (రిటైర్డ్ ప్రొఫెసర్) అన్నారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఓటర్ల నమోదు, తదితర అంశాలపై చర్చించేందుకు బుధవారం ఖమ్మం వచ్చిన ఆయన సీపీఎస్ జిల్లా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వమించారు. ఖమ్మం- వరంగల్-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ, లెక్చరర్ల ఓటర్లు తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

ప్రతి ఉపాధ్యాయ, అధ్యాపకులు వెంకటస్వామి గెలుపునకు కృషి చేయాలని సీపీఎస్ ఈయు జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాసరావు, వరంగల్ జిల్లా సీపీఎస్ అధ్యక్షుడు జీవన్ కుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అనేక సంక్షేమ పథకాలు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల సౌకర్యార్థం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి యలగందుల రాజశేఖర్ అన్నారు. ఖమ్మంలోని గుట్టల బజార్లో ఉన్న భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులకు కల్పిస్తున్న ఆర్థిక సహాయం, పరికరాలు, బోధనోపకరణాలు వంటి వాటిని వివరించారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ ఇప్పించడం ద్వారా ప్రభుత్వం నెలకు 4000 రూపాయలు పింఛన్ కూడా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దివ్యాంగులకు నిర్వహించిన క్రీడలలో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ హైస్కూల్ హెచ్ఎం గాయత్రి, పీ ఎస్ గుట్టల బజార్ హెచ్ఎం విజయ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు లావణ్య, సరిత, రామ్ సింగ్, సుభద్ర , ఉపాధ్యాయులు , దివ్యాంగులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై శ్రీచైతన్య విద్యార్థుల అవగాహన

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఖమ్మం ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ సాంబ కోరారు. బుధవారం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఇన్స్‌పెక్టర్ సాంబ హాజరై మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించి హెల్మెంట్ లేకుండ ప్రయాణించే వాహనదారులకు గులాబి పువ్వు ఇచ్చిట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ వెంకన్న, పాఠశాల ప్రి న్సిపాల్ టీఎల్ఎన్ శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



'సత్తుపల్లి సభకు తల్లాడ నుంచి వంద కార్లతో ర్యాలీ'

తల్లాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం జరిగే సభకు తల్లాడ మండలం నుంచి వందకార్లతో తరలివెళ్లాలని మండల కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. బుధవారం తల్లాడ రైతువేదికలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. గురువారం మధ్యాహ్నం సత్తుపల్లి మండలం బుగ్గపాడులో జరిగే మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు తల్లాడలోని జీఎస్ఆర్ గార్డెన్ నుంచి కార్ల ర్యాలీగా తరలివెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాస్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో



తల్లాడలో నాస్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

తల్లాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని పినపాక, బిల్లుపాడు, తల్లాడ విద్యాలయాల్లో నిర్వహించిన నాస్ పరీక్షలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ పరిశీలించారు. బిల్లుపాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి డీఈవో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఎంఈవో తనిఖీ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నక్కా రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులను అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

'తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

కొణిజర్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సింగరాయపాలెం, గుబ్బగుర్తి, సిద్దిక్‌నగర్ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షం కారణంగా తడిసిందని, ప్రభుత్వం తడిసిన ధాన్యానికి నిబంధనలు పేరు చెప్పి కొనేటప్పుడు కొర్రీలు పెట్టకుండా కొనాలని కోరారు. సకాలంలో ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వేగం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రామనరసయ్య, సత్యనారాయణ, లక్ష్మి, బాబు తదితరులున్నారు.

సిరులు కురిపిస్తున్న పూల సాగు

▸▸ బంతిపూల సాగుతో లాభాల బాటలో రైతులు



ముదిగొండలో బంతిపూల సాగు

ముదిగొండ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పూల సాగు సిరులు కురిపిస్తోంది. తక్కువ విస్తీర్ణంలో నికర లాభం అర్జిస్తూ రైతులు బంతి పూల సాగుతో లాభాల బాట పడుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితిలో వాణిజ్య పంటల సాగుతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గుచూపుతున్నారు. వాణిజ్య పంటల్లో శ్రమ కు తగిన ఫలితం రాకపోవడంతో తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో లాభాలు వచ్చే బంతి పూల సాగుపై మక్కువ చూపుతున్నారు. ముదిగొండ మండలంలోని వెంకటాపురం, ఖానాపురం, సువర్ణాపురం, ముదిగొండ, బాణాపురం, కమలాపురం తదితర గ్రామాల్లోని రైతులు బంతిపూల సాగుచేశారు. ఎకరాకు దాదాపు ఖర్చులు పోను రూ.రెండు లక్షల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో బంతిపూలకు డిమాండ్ ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంతిపూల సాగు కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం ఉండటంతో బంతి పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. బంతి పూల సాగుకు తెగుళ్లు, చీడపీడలు తక్కువేనని రైతులు చెబుతున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఉరిమళ్ల బాబూరావు తన సొంత ఎకరం భూమిలో నీటి ఎద్దడి లేకుండా డ్రిప్‌తో బంతిపూల సాగు చేపట్టాడు. కార్తీకమాసం, అయ్యప్పస్వామి పూజలు, పెళ్లిమండపాల వల్ల మార్కెట్లో ఆశించిన ధర లభిస్తోందని రైతులు అంటున్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు నుంచి బంతి మొక్కలు తెచ్చి ఎకరాకు ఆరు వేల చెప్పున మొక్కలు నాటారు. మంచి లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

మంచి ఆదాయం వస్తుంది
●ఉరిమళ్ల బాబూరావు, రైతు, వెంకటాపురం



బంతిపూల సాగు కోసం ఎకరాకు డ్రిప్‌తో కలిపి రూ.60వేలు పెట్టుబడి పెట్టి ఇప్పటివరకు రెండు కటింగ్‌లు చేశాను. కిలో పూలు రూ.80 పలుకుతుంది. ఇప్పటికే పెట్టుబడి పూర్తయింది. ఇప్పటి నుంచి వచ్చే ఆదాయం రూ.2లక్షల వరకు వస్తుంది. తక్కువ ఖర్చుతో బంతిపూల సాగుతో లాభం వస్తుంది.

సాగర్‌కాల్వల పరిశీలన

కల్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ కల్లూరు సర్కిల్ పరిధిలో గల సాగర్ ఎడమకాల్వపై కప్పలబంధం వద్ద గల రెగ్యూలెటర్లను ఎస్ఈ వాసంతి బుధవారం పరిశీలించారు. కాల్వలపై పిచ్చిమొక్కలు తొలగించడం కోసం అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఎస్ఈ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ జడ్. రత్నాకర్ ఏఈ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను బుధవారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులు సమస్యలను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ విద్యాలయాన్ని పరిశీలించారు. బుధవారం తహసీల్దార్ కూడా విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా 36బస్తాల బియ్యం నాణ్యమైనవి కావని గుర్తించి వెంటనే ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌ను సంప్రదించి నాణ్యత కలిగిన బియ్యంతో మార్పిడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సురేష్‌బాబు, ప్రిన్సిపల్ సమత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత ఉత్పత్తే లక్ష్యం

▸▸ ఏఐటీయూసీ ఉప ఫిట్ సెక్రటరీ భరణి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద రహిత ఉత్పత్తే లక్ష్యంగా సింగరేణి కార్మికులు పనిచేయాలని ఏఐటీయూసీ ఉప ఫిట్ సెక్రటరీ భరణి అన్నారు. కిష్టారం ఓసీలో పనిచేసే హెడ్ ఓవర్‌మన్ తీట్ల సత్యనారాయణ మృతిచెందడం పట్ల బుధవారం ఓసీపీలో సంతాప సభ నిర్వహించారు. కార్మికులంతా వ్యక్తిగత రక్షణ పాటిస్తూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ, వల్లమల బాబు, మోహన మురళీ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

▸▸ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



మధ్యాహ్న భోజనం చేస్తున్న రాయల, పువ్వాళ్ల

ముదిగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే తమ భవిష్యత్ దిశానిర్దేశం చేసుకోవచ్చని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలను డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలసి పరిశీలించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసకావొద్దని, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రూ.1.50లక్షల విలువైన టీవీని కళాశాలను బహుమతిగా అందిస్తానని రాయల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు బులెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు వల్లూరి భద్రారెడ్డి, ఉపేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



రామచంద్రాపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. వేంసూరులో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక రైతువేదికలో 48మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 55మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ.రాజు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో రంజిత్ కుమార్, ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

సీసీ రోడ్లకు శంకుస్థాపన

పెనుబల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ప ర్యటించారు. రామచంద్రాపురం, ఏరుగట్ల, పార్థసారథిపురం, చౌడారం, లింగగూడెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దా ర్ గంటా ప్రతాప్, ఎంపీవో ఉపేంద్రయ్య, పం చాయతీరాజ్ ఏఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం రెబ్బవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ జలాది పార్థసారథి(జేపీ) కుటుంబానికి 2003 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు బుధవారం ఆర్థికసాయం అందించారు. పార్థసారథి తల్లిదండ్రులు, భార్య, కుమార్తెలకు రూ.2.250లక్షల నగదును కానిస్టేబుళ్లు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీనివాసరెడ్డి, సతీష్, హరికృష్ణ, కిరణ్, శ్రీను, మల్లేష్, కృష్ణ, రామయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి

పురుడుపోసిన కొమరయ్య

రేపు దొడ్డి కొమరయ్య సినిమా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతాంగ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య బలిదానం తెలంగాణ సాయుధ పోరాటానికి పురుడుపోసిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద దొడ్డి కొమరయ్య చిత్ర వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు. ఆధిపత్యానికి, అహంకారానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమబాట పట్టేందుకు ఇప్పటి జనగామ జిల్లాలోని కడవెండి గ్రామానికి చెందిన కొమరయ్య దొరలపై తిరగబడ్డ చరిత్రను ఇతివృత్తంగా మలిచి సినిమా చిత్రీకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో చిత్ర ప్రచార కార్యదర్శి పొన్నంపల్లి సలోని, కమిటీ చైర్మన్ అల్లాడి రాము, కో-కన్వీనర్ దేవరపల్లి రాజకుమార్, వైస్ చైర్మన్ కాయితోజు వెంకటేశ్వర్లు, గంజి ఝాన్సీ పాల్గొన్నారు.

'బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి'

తల్లాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్ ఆదేశించారు. బుధవారం తల్లాడ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వైరా సీఐ ఎన్.సాగర్, తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లు నందిని జన్మదిన వేడుకలు

ఎర్రుపాలెం/ముదిగొండ/మధిరటౌన్/బోనకల్/చింతకాని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గ వ్యాప్తంగా డిప్యూటీ సీఎం సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని జన్మదిన వేడుకలు బుధవారం పలువురు నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పేదలకు పండ్లు, నిత్యావసరాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మధిర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నవీన్

మధిరటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ మధిర నియోజకవర్గం అధ్యక్షుడిగా తూమాటి నవీన్‌రెడ్డి వరసగా రెండో సారి గెలుపొందారు. మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో కృష్ణాపురానికి చెందిన పోచేపల్లి సురేష్ విజయం సాధించారు. గెలుపొందిన ఇద్దరు నాయకులను కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

చింతకాని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన కంచుమర్తి రామకృష్ణ (ఆర్.కే) గెలుపొందాడు. బుధవారం వెల్లడించిన ఫలితాలలో రామకృష్ణ 732 ఓట్ల ఆధిక్యం సాధించారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని ధర్నా

వైరా, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకనుగుణంగా ఆర్టీసీ బస్సుల సర్వీస్‌ల సంఖ్యను పెంచాలని, ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైరాలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీవై.పుల్లయ్య, వైరా డివిజన్, మండల కార్యదర్శులు వై.బాబు, బండారు భద్రయ్య, కె.దర్గయ్య, బద్రీ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాత

తల్లాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):సమాచార పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కె.జాన్ కళాబృందం బుధవారం తల్లాడ మండలంలోని మూడు గ్రామాల్లో కళాప్రదర్శనలు నిర్వహించింది. ప్రజాపాలన కళాయాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తల్లాడ, మల్లవరం, కుర్నవల్లి గ్రామాల్లో పాటలు, నృత్యాలతో కళాప్రదర్శనలు నిర్వహించారు. ఆరు గ్యారెంటీల అమలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు సుధాకర్‌రావు, పరకాల అజయ్, పిడియాల లక్ష్మయ్య, మాచర్ల కృష్ణ, బంకా భద్రయ్య, కొండ్రు గోపి పాల్గొన్నారు.పెనుబల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం పలు గ్రామాల్లో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. చామలమడుగు కోటేశ్వరరావు బృందం ప్రజాపాలన విజయోత్సవాల గురించి ముత్తగూడెం, లంకాసాగర్, తుమ్మలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ మునగాల వెంకటరత్నం, బీరెల్లి వెంకటరమణ, కొమ్ము రమేష్, బాణోతు రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

▸▸ ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ



మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

బోనకల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి బండి పద్మ ఆరోపించారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై వేధింపులు, దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో ప్రిన్సిపాల్ నళినిశ్రీ, ఉమ, వాణి, వెంకట రమణ, నవ్య, సునిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆరోపణలు నిరాధారం: కాంగ్రెస్

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అన్నారు. బుధవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేకంగా దృష్టిసారించి పెద్ద ఎత్తున రైతు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధరతోపాటు బోనస్‌ను అందించే సదుద్దేశ్యంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి విరుద్ధంగా సీపీఎం నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఏదునూరి సీతారాములు, దొడ్డా పుల్లయ్య, పొదిల హరినాథ్, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పణితి శ్రీను పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతకాని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నేటి నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీఐ సాగర్ బుధవారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దివ్యాంగుల దినోత్సవం

ఏన్కూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం. కూరాకుల సైదయ్య, పీడీ వీరయ్య, ఐఈఆర్‌పీ సాంబయ్య, సీఆర్పీ ప్రసాద్, ఎంఐఎస్ హిలిత, సీసీవో లత, సీఆర్పీ సుమన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకికి మువ్వా నివాళులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 13వ వార్డు కౌన్సిలర్ అద్దంకి అనిల్ మాతృమూర్తి భూలక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు బుధవారం ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అద్దంకి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఆయన వెంట కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో చిన్మయదాసు, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం కల్లూరులో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి అంబేద్కర్ కాలనీ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వహిందు పరిషత్ అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి జగదీష్, నరిసింహారావు, కృష్ణయ్య, కస్తూరి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కారేపల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల సంక్షేమం టీడీపీ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలూరి రామారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుదిపాళ్ల భాస్కర్‌రావు, సీతారాములు, వేములూరి కోటచారి, అవులఅంజయ్య, మల్లెంపాటి శ్రీనివాస్‌రావు తదతరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భూప్రకంపనలు



పెనుబల్లిలో స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

వైరా/మధిర/ సత్తుపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆయా నియోజకవర్గాల్లో బుధవారం 7గంటల 27నిమిషాల తర్వాత భూమి కొద్ది సెకన్ల పాటు భూమి కదిలింది. దీంతో ప్రజలందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇళ్లలోని సామాగ్రి కిందపడిపోవడం, కుక్కలు మొరగడం చేశాయి. తెలంగాణలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదవ్వగా ఇందుకు సంబంధించిన సీసీ టీవీల్లో రికార్డై సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

వ్యవసాయంపై రైతులకు శిక్షణ

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణ కేంద్రంలో బుధవారం విత్తే వరి వ్యవసాయంపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారులు అరుణ జ్యోతి, భాస్కరరావు, పీఐ ఫౌండేషన్ తరుపున హర్షదీప్‌లు రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రూప, ఏఈవో పవన్‌కళ్యాణ్, రైతులు వైకంటి శ్రీనివాసరావు, వెంకయ్య, శ్రీను పాల్గొన్నారు.

'పోడు భూములకు హక్కు పట్టాలివ్వాలి'

పెనుబల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఇతర పేదల సాగులో ఉన్న పోడుభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వీఎంబంజర్‌లో చలమాల సూర్యనారాయణ భవనంలో గాయం తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి చిమల విశ్వనాథం, తడికమళ్ల చిరంజీవి, భూక్యా రాములు, మంగమ్మ, జొన్నలగడ్డ రమణయ్య, కండే సత్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన

బోనకల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ ఏ. పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో డి. పుల్లయ్యలు పరిశీలించారు. కిచెన్ పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదే విధంగా గోవిందాపురం(ఎల్) ఉన్నత పాఠశాలను జిల్లా ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్ తనిఖీ చేశారు.

ట్రైబల్ ఫార్మింగ్ సొసైటీలో నగదును భద్రపరిచేందుకు పలువురి నిరాకరణ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన వ్యవసాయ పొలంలో చెరకు పంట కోసి ఫ్యాక్టరీకి తరలించేందుకు, వచ్చిన సొమ్మును భద్రపరిచేందుకు బుధవారం గంగారంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో 16మంది సభ్యులు మాత్రమే అంగీకారం తెలిపారు. మొత్తం 52లో మిగతా 36మంది రెండు అంశాలను తిరస్కరించి సమావేశం నుంచి మధ్యలోనే బయటకు వచ్చారు. మండలంలోని రామగోవిందాపురం గ్రామానికి తూర్పు, పడమర వైపున గల సొసైటీ భూములలో సుమారు 50ఎకరాలలో చెరుకు తోటను సభ్యులు కౌలుకు ఇచ్చారు. చెరుకు కోతకు రాగా ఆలస్యం చేసినట్లయితే పంట నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో సంఘం పర్సన్ ఇన్‌చార్జి రామిరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం తరపున పర్సన్ ఇన్‌చార్జి పేరుతో డీసీసీబీ సత్తుపల్లి బ్రాంచ్‌లో సేవింగ్ ఖాతాను తెరచి వచ్చిన సొమ్మును భద్రపరచాలని అధికారులను భావించిగా, 36మంది సభ్యులు వ్యతిరేకించారు. తమకు సొసైటీలో కొంతమంది గతంలో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను సొసైటీలో చేర్పించకుండా సంబంధం లేని వ్యక్తులను చేర్చారని, ఎన్నో ఏళ్లుగా ఐకమత్యంతో సాగుచేసుకుంటుండగా, కొత్తగా సమస్యలు తీసుకువచ్చారని 36మంది సభ్యులు వాపోయారు. కాగా ఇదే విషయమై పర్సన్ ఇన్‌చార్జి రామిరెడ్డి మాట్లాడుతూ సమావేశం, తిరస్కరించిన సభ్యుల వివరాలను అధికారులకు నివేదిస్తానని తెలిపారు.

విజయోత్సవాల పేరుతో కాంగ్రెస్ మరో మోసం

▸▸ బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఎర్రుపాలెం/మధిర డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయోత్సవ సంబురాల పేరుతో కాం గ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మీనవోలు నుంచి జమలాపురం వరకు నిర్వహించిన బీజేపీ బైక్‌ర్యాలీలో ఆయన పాల్గొనిమాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు, సాంబశివరావు, గుగులోతు నాగేశ్వరరావు, పాపట్ల రమేష్, నాయకులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ధాన్యం కొనుగోలు చేయరూ..

▸▸ బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రంలో

15 రోజులుగా అన్నదాత ఎదురు చూపులు





కొనుగోలు కేంద్రంలో కాంటాల కోసం ఎదురు చూస్తున్న రైతు రఘు

బోనకల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు కొర్రీలు వేస్తుండటంతో తన పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తన ధాన్యం తీసుకొచ్చి 15 రోజులు అవుతు న్నా కాంటాలు వేయలేదని రైతు తేళ్లూరి రఘు వాపోయాడు. నిబం ధనల మేరకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమశాతం చూసి కాంటాలు వేస్తారని, సకాలంలో లోడింగ్ జరుగుతుందని భావించి 200 బస్తాలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. ప్రారంభంలో తేమశాతం నిబంధనల మేరకు రాలేదని, ఆ తరువాత తేమశాతం బాగానే ఉంది కాని, ఒక్క రైతుకు సంబంధించి 200 బస్తాలకు లారీలు లోడింగ్ రావడం అలస్యం అవుతుందని అధికారులు చెప్పారని తెలిపాడు. వడ్లల్లో మట్టి ఉందని జల్లెడ వేయాల్సి ఉంటుందని ఒక్కొక్కటిగా కారణం చెబుతూ తన ధాన్యాన్ని రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలో ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం ధాన్యం చూసి మిల్లర్లతో మాట్లాడగా వారు పంపించమని చెప్పినా ఇంకా పని కాలేదని ఇంకా ఎన్ని రోజులు వేచి ఉండాలో తెలియడం లేదని, వెంటనే కాంటాలు వేసేలా చూడాలని కోరారు.